## క్లుప్తంగా

### పీహెచ్‌సీలోనే కాన్పులు సురక్షితం



పాన్‌గల్: పీహెచ్‌సీలోనే కాన్పులు సురక్షితమని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవులు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కదిరెపాడు గ్రామానికి చెందిన పూజిత సాధారణ కాన్పులో మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకొని ప్రభుత్వం అందించే ప్రోత్సహాకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ సౌసల్య, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



అయిజ: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బింగుదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు బుధవారం ఉదయం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలంకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున ఆయన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అది గమనించిన చుట్టుపక్కల ఇండ్ల వారు కాలిపోతున్న ఇంటి తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, ఎల్‌ఈడీ టీవీ, ఇన్వర్టర్, విలువైన దుస్తులు కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఓటు వేశారు.. పనులకు వెళ్లారు

ఉండవెల్లి: మండలంలోని ఓటర్లు గ్రామంలో ఉదయాన్నే ఓటు వేసి వ్యవసాయ పనులకు వెళ్లిపోయారు. గురువారం అన్ని గ్రామాల్లో ఉదయాన్నే ఓటు వెయ్యడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఓటును వినియోగించుకున్నారు.

### పార్కులో పందుల సంచారం



అమరచింత: పట్టణ ప్రజల కోసం మున్సిపల్ అధికారులు రాజావళి దర్గా ఆవరణంలో ఏర్పాటు చేసిన పార్కు ప్రస్తుతం పందులకు ఆవాసంగా మారింది. పార్కులోని మొక్కలు సైతం వాడుముఖం పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళ చిన్నారులు, వృద్ధులు పార్కులో ఆటవిడుపు కోసం వెళితే పందులు సంచరిస్తుండటంతో వెనుదిరుగుతున్నారు. పందులను పట్టణం నుంచి తరలిస్తున్నామని చెబుతున్న మున్సిపల్ అధికారులు పార్కులోని పందులను అరికట్టి పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అయ్యప్ప దీక్ష స్వీకరణ



గండేడ్/మహమ్మదాబాద్: మహమ్మదాబాద్ మండల కేంద్రం శివారులో కాంతిమల శిఖరం, అయ్యప్పస్వామి కొండపై గురువారం పలువురు భక్తులు అయ్యప్పస్వామి దీక్షను స్వీకరించారు. మహమ్మదాబాద్ మండలంతో పాటు గండేడ్, హన్వాడ మండలాలకు చెందిన భక్తులకు అయ్యప్పస్వామి మాలాధారణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### కౌంటింగ్ సెంటర్ పరిశీలన

నాగర్‌కర్నూల్: కౌంటింగ్ మీడియా సెంటర్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు అన్నారు. పట్టణ శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఆదివారం జరిగే కౌంటింగ్ ప్రక్రియకు మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్, ప్రింట్ పాత్రికేయుల కౌంటింగ్ మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని ఏపీ ఆర్‌ఓ తిరుపతయ్యకు సూచించారు.





దేవరపల్లిలో..



పాన్‌గల్‌లో ఓటు వేసిన యువత



అమరచింతలోని ఉర్దూమీడియం పోలింగ్ బూత్‌లో ఓటు కోసం బారులుదీరిన ఓటర్లు



దంతనూరులో క్యూలో నిలబడిన జనం

# ముగిసిన ఎన్నికల సంబురం

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలంలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి ఏడు గంటల వరకు కొనసాగింది. మండలంలో మొత్తం ఓటర్లు 30,563 ఉండగా.. 35 పోలింగ్ కేంద్రాల్లో 79 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆత్మకూర్‌లో పర్యటించి ఓటరు సరళిపై నాయకులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ కేఎస్‌రత్నం, తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్, ఎంపీడీఓ నాగేందర్, సెక్టోరియల్ అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

పాన్‌గల్: మండలంలోని 28 పంచాయతీల పరిధిలో 43 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 40,876 ఓటర్లు ఉండగా 32,347 ఓట్లు పోలయ్యాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.



ఆత్మకూర్‌లో ఓటుహక్కును వినియోగించుకున్న ఓటర్లు

### మొరాయించిన ఈవీఎంలు

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో 247 పోలింగ్ బూత్‌లో ఈవీఎం నెమ్మదిగా పనిచేయడంతో రాత్రి వరకు పోలింగ్ నిర్వహించారు. అదేవిధంగా అమడబాకులలో 268 ఈవీఎం మొరాయించడంతో అధికారులు కాసేపు ఓటింగ్‌ను నిలిపివేసి ఈవీఎంను సరిచేసి 20 నిమిషాల తర్వాత మళ్లీ ఓటింగ్‌ను ప్రారంభించారు. అమడబాకుల, వడ్డెవాట, కొత్తకోటలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య కాస్త తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతిపజేశారు. కొత్తకోట మండల కేంద్రంతో పాటు మండలంలోని 22గ్రామాల్లో మొత్తం 51,352మంది ఓటర్లకు గాను 40,843మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 20,792, మహిళలు 20,052 మంది ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లోని 24వ పోలింగ్ బూత్, షాపురంలోని పోలింగ్ బూత్‌ల వద్ద సాయంత్రం 5 గంటలు దాటినా ఓటింగ్ కొనసాగించారు. గొడవలు జరగకుండా ఎస్ఐ శ్రీహరి పోలీసు సిబ్బందితో తరుచుగా గ్రామాలు తిరుగుతూ ఓటర్లు గుంపులుగా ఉండకుండా చెదరగొట్టారు. మండలంలోని షాపురంలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించకుండా సీఐ రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. అమచింత పట్టణానికి చెందిన చండీగఢ్, పంజాబ్ రాష్ట్రాల బీజేపీ ఆర్గనైజర్ మంత్రి శ్రీనివాస్ తన ఓటు హక్కును అమరచింతలో వినియోగించుకున్నారు. ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

### 84 శాతం నమోదు

మదనాపురం: మండలంలో 20,408 ఓట్లగాను 84 శాతం 17,141ఓట్లు పోలయ్యాయి. వీరిలో 8,633 మంది పురుషులు 8,508 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ అబ్రహం లింకన్ తెలిపారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ, పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్టూరు, అయ్యవారిపల్లి, చల్లపాడు, కాలూరు, లక్ష్మీపల్లి, దగడపల్లి, అమ్మాయిపల్లి, వెలగొండ, మియాపూర్, బస్వాపురం, బెక్కం గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

పెబ్బేరు రూరల్: ఉమ్మడి మండలంలో 29 గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

గోపాల్‌పేట: మండలంలో 78 శాతం ఓటింగ్ నమోదయిందని అధికారులు వెల్లడించారు. గోపాల్‌పేట పోలింగ్ స్టేషన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూడి మేఘారెడ్డి సందర్శించారు. బీఎస్పీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన మండ్ల మైబూస్ సొంత గ్రామం బుద్ధారంలో తన ఓటుహక్కు వినియోగించుకున్నాడు. 1598+1 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



తాటిపాములలో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



బుద్దారంలో ఓటుహక్కు వినియోగించుకున్న బీఎస్పీ అభ్యర్థి మండ్ల మైబూస్

### అడిషనల్ ఎస్పీ సందర్శన



వీపనగండ్ల: మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాస్‌తేజ శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేసిన శిరీష (బర్రెలక్క) పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడారు.

### సిబ్బందితో ముచ్చట్లు



పోలీసులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట మండలంలోని పోలింగ్ కేంద్రాలను దేవరకద్ర బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను ఆప్యాయంగా పలకించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

### కానాయపల్లిలో 'మాజీ ఎంపీ రావుల'



కొత్తకోట మండలంలోని కానాయపల్లిలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం అని, గ్రామాల్లో అందరూ కలిసిమెలిసి ఉండాలని కోరారు.

# బారులుదీరిన మహిళలు



గోపాల్‌పేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం మొదటి నుంచి మహిళలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నాటి నుంచి బీఎల్‌ఓలు మహిళలకు అవగాహన కల్పించారు. దీనికి తోడు ప్రభుత్వం పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలకు కావల్సిన అన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు.



అమ్మాయిపల్లిలో..



వడ్డెవాటలో బారులు తీరిన మహిళా ఓటర్లు

### పలువురిపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఓటర్లను ప్రలోభాలతో తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేందుకు నగదు పంపిణీ చేస్తున్న ఆరుగురిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం రాత్రి షేరిల్లివీధి, గంటవీధి, సుంకులమ్మ మెట్టు, చింతలపేట, నవరంగ్ థియేటర్ ప్రాంతాల్లో ఓటర్లకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు డబ్బులు పంచుతున్నట్లు గుర్తించి వారి నుంచి రూ.లక్ష 11వేల నగదును సీజ్ చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### కేంద్రాల వద్ద 144 సెక్షన్

కల్వకుర్తి /కల్వకుర్తి టౌన్: నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 5.30 మాక్ పోలింగ్ నిర్వహించిన పోలింగ్ అధికారులు, 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో, పోలీసులు 200 మీటర్ల దూరం వరకు ఎవ్వరిని అనుమతించలేదు. పార్టీల కార్యకర్తలు పోలింగ్ కేంద్రం బయట ఓటు వేయడానికి వచ్చిన వారిని ఓటేయాలని అభ్యర్థించారు. పట్టణంలోని బలరాంనగర్ కాలనీలోని 89వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంపై సిరా గుర్తు ఓ పార్టీ అభ్యర్థిపై ఉందని పలువురు పీఓకు ఫిర్యాదు చేశారు. కల్వకుర్తి రిటర్నింగ్ అధికారి శ్రీను, డీఎస్పీ పార్థసారథి పోలింగ్ బూత్‌కు చేరుకొని పరిస్థితిని చక్కబెట్టి పోలింగ్ నడిచేలా చూశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సహాయకులుగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు వారి ఓటును వెతికిపెట్టారు. ఉదయం పోలింగ్ ప్రారంభమైన సమయం నుంచి 9 గంటలకు 5 శాతం, 11 గంటలకు 18 శాతం, మధ్యాహ్నం 1 గంటలకు 39.5 శాతం, మధ్యాహ్నం 3 గంటలకు 60.1 శాతం పోలింగ్ నమోదైనట్లుగా రిటర్నింగ్ అధికారి శ్రీను తెలిపారు. సాయంత్రం 5 గంటలు దాటినా పలు పోలింగ కేంద్రాలలో క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరిని ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను, ఓట్ల లెక్కింపు చేపట్టే ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు.



# వృద్ధులు, దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



పాంరెడ్డిపల్లిలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్‌చైర్‌పై వస్తున్న 85 ఏళ్ల వృద్ధురాలు

సాక్షి, నెట్‌వర్క్: వృద్ధుల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ వహించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వృద్ధులకు మొదటిసారిగా పోస్టల్ బ్యాలెట్ అందుబాటులోకి తెచ్చింది. పోలింగ్ కేంద్రానికి రాలేని 80 ఏళ్ల వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించడంతో పాటు ఎన్నికలకు వారం రోజుల ముందు నుంచి అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ వారి నుంచి ఓటు వేయించారు. అప్పుడు ఓటు హక్కు వినియోగించుకోని వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నియమించిన వలంటీర్లు ఓటు వేయడానికి వచ్చే వృద్ధులను వీల్‌చైర్‌పై కూర్చొబెట్టుకొని, వారు ఓటు వేసి బయటికి వెళ్లే వరకు వెంటనే ఉండి చూసుకునేలా ఏర్పాట్లు చేశారు.



వనపర్తిలో ఓటు వినియోగించుకున్న 80ఏళ్ల వృద్ధురాలు



వృద్ధుడిని వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది



ఖిల్లాఘనపురంలో..

# ఘనంగా అయ్యప్ప పడిపూజ

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని వాసవికన్య కా పరమేశ్వరి ఆలయ సమీపంలోని కన్య స్వామి శ్రీనివాసులు ఇంట్లో గురువారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రఘుస్వామి ఆధ్వర్యంలో మాలధరించిన అయ్యప్ప స్వాములు భజన భక్తిపాటలను పాడారు. వినాయకుని, కుమారస్వామి అయ్యప్పలకు అష్టోత్తర అర్చన చేశారు, అయ్యప్ప స్వామి 18 మెట్లను అందగంగా పూలతో అలంకరించిన మెట్లకు ప్రత్యేక పూజలను నిర్వహించి, స్వామి వారికి నివేదన పెట్టి, పెటతుళ్లి ని అడారు. అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామికి హరిహరసనం, పవలింపు చేసి పూజ కార్యక్రమాలకు పరిసమాప్తి పలికి బిక్ష ఏర్పాటు చేశారు. మాలధరించిన అయ్యప్ప స్వాములు కృష్ణ, రాము, నవీణ్, శ్యామ్, రంగ, విజయ్ శ్రీనివాసులు, తదితర స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామికి నమస్కరిస్తున్న అయ్యప్ప మాలధారులు

# శివాలయంలో ప్రత్యేక పూజలు

నర్వ: కార్తీక మాసం సందర్భంగా నర్వ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కార్తిక దీపారాధన చేసేందుకు వచ్చిన భక్తులకు తరలివచ్చారు. దీంతో పాటు స్వామి వారికి బిల్వ దళాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు మాట్లాడుతూ కార్తీక మాసంలో శివుడికి ఆరాధిస్తే సకల సంతోషాలు ప్రాప్తిస్తాయని పేర్కొన్నారు. మహిళలు దీపారాధన చేయడం ద్వారా వారికి అంతా మంచే జరుగుతుందని తెలిపారు.



# కచ్చరహదారి బీటీగా మారేదెన్నడు?

అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చరహదారిని బీటీగా మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదు. సుమారు ఐదున్నర కిలోమీటర్ల మట్టి రహదారికి బీటీ కోసం ప్రభుత్వం పలు దఫాలుగా నిధులు మంజూరు చేయడం, పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోవని వెనక్కి వెళ్లడంతో పనులు మరుగున పడుతున్నాయి. ఇరు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగ పడే రహదారి కావడంతో బీటీగా మార్చాలని ఇరు గ్రామాల రైతులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు అధిక భాగం ఇరుగ్రామాల మధ్య ఉండటంతో ఎత్తిపోతల సంఘం డైరెక్టర్లు, రైతులు రహదారిని సీసీగా మార్చమంటూ పీజేపీ అధికారులకు గతంతో విన్నవించారు. రైతుల విన్నపానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు రహదారి పరిశీలించేందుకు వచ్చి పరిస్థితులను అంచనా వేశారు. వీటి కోసం సీసీ రహదారి నిర్మించాలని నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికీ పనులు చేపట్టలేదు. ఇరిగేషన్, పీఆర్ అధికారులు స్పందించి కచ్చరహదారి రూపురేఖలు మార్చాలంటూ కోరుతున్నారు.



అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే కచ్చరహదారి